క్లుప్తంగా

మత్తుతో జీవితాలు నాశనం



ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

నారాయణఖేడ్: మత్తుకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని ఖేడ్ ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.నారాయణ తెలిపారు. బుధవారం కళాశాలలో మత్తుపదార్థాల నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థిలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు, వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి సమగ్రంగా వివరించారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు చేతబూని ప్రదర్శన నిర్వహించారు. కళాశాల యాంటీ డ్రగ్స్ కన్వీనర్ పోశెట్టి, అధ్యాపకులు రాములు, హరి, హవప్ప పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి పెరిగిన బిల్లులే

కంగ్టి ఎంఈఓ మహ్మద్ రహీముద్దీన్



మాట్లాడుతున్న ఆర్పీ అరుణ్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు ఇక నుంచి పెరిగిన బిల్లుల ప్రకారమే డబ్బులు రానున్నాయని కంగ్టి ఎంఈఓ మహ్మద్ రహీముద్దీన్ తెలిపారు. బుధవారం మండల మానవ వనరుల కేంద్రంలో సీసీహెచ్‌లు, ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడి పిల్లల కోసం వంటలు పౌష్టికంగా ఉండేట్లు చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వండాల్సిన వంటకాలపై చర్చించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు యశ్వంత్ రాథోడ్, విఠల్‌రెడ్డి, ఉపాధ్యాయులు కిఫాయత్‌అలీ, ఆర్పీ అరుణ్‌కుమార్, సీఓ కృష్ణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి




అర్జీని స్వీకరిస్తున్న తహసీల్దార్ బాలరాజ్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భూ భారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని నాయబ్ తహసీల్దార్ బాలరాజ్ రైతులకు సూచించారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. రైతులు భూములకు సంబంధించిన సమస్యలు రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. భూ సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకుని పరిష్కరించుకోవచ్చని తెలిపారు. గ్రామంలో రైతుల నుంచి రెవెన్యూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ గంగాధర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి

కొండాపూర్(సంగారెడ్డి): విద్యార్థులకు పెంచిన బస్‌పాస్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని బహుజన సేన స్టేట్ కమిటీ సభ్యుడు డప్పు రాజు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మల్కాపూర్ చౌరస్తాలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజు మాట్లాడుతూ...విద్యార్థులకు సమయానికి అనుగుణంగా సరిపడా బస్సులు నడపాలని విద్యార్థులు ఓ వైపు ధర్నాలు చేస్తుంటే, మరోవైపు ప్రభుత్వం బస్ పాస్ ధరలను పెంచడం సరికాదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెబుతూ విద్యార్థులపై భారం మోపడం వేయడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించకుంటే బహుజనసేన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ అధికారి ఆసియా, ఏఈవో వంశీకృష్ణ, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు తప్పకుండా రశీదు అందజేయాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. రికార్డులను ఏవో తనిఖీ చేసి, స్టాక్ వివరాలను పరిశీలించారు.

వ్యాధుల కాలం.. జర పైలం

- సీజనల్ వ్యాధులతో పొంచి ఉన్న ప్రమాదం
- అప్రమత్తతే ప్రధానం
- పరిసరాల పరిశుభ్రత అవసరం

హత్నూర(సంగారెడ్డి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు భయపెడుతుంటాయి. గ్రామాల్లో కలుషితమైన నీరు, దోమలు, అపరిశుభ్రమైన వాతావరణంతో వ్యాధులు ప్రబలుతాయి. ముఖ్యంగా ఈ సీజన్‌లో మెదడువాపు, చికెన్ గున్యా, డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలుంటాయి. మనం తీసుకునే చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు వైద్యాధికారులు ఇప్పటికే ఆదిశగా చర్యలు ప్రారంభించారు.



బృందాల ఏర్పాటు

స్థానికంగా ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ, ఎంఎల్‌హెచ్‌పీలతో కూడిన బృందాలు ఏర్పాటు చేయడంతోపాటు జిల్లాలోని 246 ఆరోగ్య ఉపకేంద్రాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ, మూడు డీప్యూటీ డీఎంహెచ్‌ఓల్లోనూ, డీఎంహెచ్‌ఓలోనూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులపట్ల అవగాహనను కల్పిస్తున్నారు.

అన్ని ఆస్పత్రుల్లోనూ రోగులకు వైద్యులు అందుబాటులో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు నుంచి ఐదుగురు వరకు సభ్యులతో ఏర్పాటు చేసిన ఈ బృందాలన్నీ అత్యవసర సేవలు అందించేందుకు సిద్ధం చేసినట్లు డీఎంహెచ్‌ఓ గాయత్రీదేవి తెలిపారు. జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని గ్రామాలలో ఇప్పటికే ఈ వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా కలెక్టర్లు సైతం సీజనల్ వ్యాధులపై సమావేశాలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

ఇవీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- దోమలు ఇళ్లల్లోకి రాకుండా కిటికీలకు, తలుపులకు, సన్నటి జాలీలు బిగించుకోవడంతో పాటు దోమ తెరలు వాడాలి.
- పందులను జనావాస ప్రాంతాలకు దూరంగా ఉంచాలి.
- మురుగునీటి గుంతలు,ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వకుండా చూడాలి.
- సాక్సులు, బూట్లు ,శరీరాన్ని పూర్తిగా కప్పి ఉండేలా ప్యాంట్లు, షర్టులు ధరించాలి.
- దోమలు కుట్టకుండా,లేపనాలు రాసుకోవాలి,పగటి పూట కూడా దోమ తెరలు వాడాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి బోండాలు వాడి పడేసిన టైర్లు ఉంచకూడదు.
- ఇంట్లో కూలర్లలో, నీటిని ప్రతి మూడు రోజులకోసారి మార్చుకోవాలి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. వర్షాకాలంలో ప్రజలు ఎలాంటి జ్వరమైనా అశ్రద్ధ చేయకుండా ముందుగా వైద్యుడిని సంప్రదించాలి. దోమల నివారణకు కాయిల్స్, లిక్విడ్స్ వేపరేజర్ల కన్నా దోమ తెరలను వినియోగిస్తే మంచి ఫలితం ఉంటుంది. ప్రజలు ముఖ్యంగా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. వర్షాకాలం ఎంతో అప్రమత్తంగా ఉండాలి.

- గాయత్రీదేవి,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ఆస్పత్రి రోడ్డు కోసం పరిశీలన



ఆస్పత్రి వద్ద రోడ్డు గురించి తెలుసుకుంటున్న ఆర్డీఓ అశోక్ చక్రవర్తి

కల్హేర్(నారాయణఖేడ్): మండల ప్రభుత్వ ఆస్పత్రికి(సిహెచ్‌సి) రోడ్డు సౌకర్యం కల్పించేందుకు నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక్ చక్రవర్తి బుధవారం పరిశీలించారు. 30 పడకల ఆస్పత్రి నిర్మించినా రోడ్డు సౌకర్యం లేదని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రి వద్దకు వెళ్లేందుకు రోడ్డు ఇరుకుగా ఉండటంతో అంబులెన్స్ రావడం కష్టంగా ఉంది. రోడ్డు ఏర్పాటు గురించి గ్రామస్తులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశ్రీనివాస్, ఆర్ఐ మల్లేశం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచయ్య, నాయకులు దేవదాస్ పాల్గొన్నారు.

రేషన్‌కు తప్పని తిప్పలు



సంగారెడ్డి పట్టణంలోని 11వ వార్డులో రేషన్ బియ్యానికి క్యూలో సంచులు పెట్టిన కాలనీవాసులు

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యానికి సంగారెడ్డి పట్టణంతో పాటు పలు గ్రామాలలో ఇబ్బందులు తప్పడం లేదు. మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వడంతో క్యూలో గంటలపాటు వేచి ఉంటున్నారు. బ్యాగులను వరుస క్రమంలో క్యూలో ఉంచి లైన్ వచ్చినప్పుడు వెళ్లి తీసుకుంటున్నారు. సర్వర్‌లో సాంకేతిక సమస్యలు వస్తున్నాయని దీంతో రేషన్ బియ్యం ఇవ్వడానికి ఆలస్యం అవుతుందని రేషన్ డీలర్లు అంటున్నారు. గంటలు గంటలు క్యూలో నిలబడి ఇబ్బందులు పడుతున్నామని ఈ సమస్యకి పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



హరిదాస్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఎగ్ బిర్యానీ తింటున్న బాలింతలు, చిన్నారులు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రతీ చిన్నారిని ముందుగా అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్ ఏసుమణి తెలిపారు. హరిదాస్‌పూర్‌లో బుధవారం నిర్వహించిన 'అమ్మమాట- అంగన్‌వాడీ బాట'కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కేంద్రంలో కొత్త విద్యార్థులను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకనుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణీలకు, చిన్నారులకు వారంలో రెండు రోజులు ఎగ్ బిర్యానిని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా తదితరులు పాల్గొన్నారు.



అమ్మమాట- అంగన్‌వాడీ బాటలో భాగంగా అనంతసాగర్‌లో ప్రదర్శన

నారాయణఖేడ్: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత కోరారు. బుధవారం ఖేడ్ మండలం అనంతసాగర్, అంత్వార్ గ్రామాల్లో అమ్మమాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సహాయకులు, చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కలిసి ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. మనూరు మండలం తిమ్మాపూర్ గ్రామంలోనూ ప్రదర్శన నిర్వహించారు.

అర్హత లేకున్నా వైద్యం.. ఐదుగురుపై కేసు

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అర్హత లేకున్నా వైద్యం చేస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో నాగమాత క్లినిక్, శ్రీలక్ష్మి పాలిక్లినిక్, శ్రీ సాయి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, శ్రీ శివసాయి క్లినిక్, కాకతీయ ఆసుపత్రిలలో సరైన అర్హత లేకున్నా ప్రజలను నమ్మించి అల్లోపతి వైద్యం చేస్తున్నారనే సమాచారంతో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీ నిర్వహించి, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురుగాలుల బీభత్సం



ఈదురుగాలులకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు భారీగా ఈదురు గాలులు, వర్షం కురిసింది. దీంతో మండల పరిధిలోని వెంకటాపూర్‌కు చెందిన సాయిలు ఇంటి పైకప్పు రేకులు ఎగిరి పోవడంతో ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీటికి సామగ్రి తడిసి ముద్దయింది. సిర్గాపూర్ మండలంలో 26.8 మి.మీలు, కలేర్, నిజాంపేట మండలాల్లో 14.6 , మనూరు, కంగ్టిలలో 9, నాగల్‌గిద్దలో 12, ఖేడ్‌లో 10 మి.మీల వర్షపాతం నమోదైంది.

అల్లుకున్న తీగలు.. పొంచి ఉన్న ముప్పు

అధికారులు పట్టించుకోవాలని విజ్ఞప్తి



సంగారెడ్డి పట్టణంలోని గొల్లగూడెంలో స్తంభాలకు ప్రమాదంగా అల్లుకున్న తీగలు

సంగారెడ్డిటౌన్: సంగారెడ్డి పట్టణంలోని గొల్లగూడెం కాలనీలో విద్యుత్ వైర్లు స్తంభాలతో ప్రమాదం పొంచి ఉంది. పలు చోట్ల ట్రాన్స్‌ఫారంలతోపాటు స్తంభాలు, వైర్లను చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు చుట్టేశాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయంతోపాటు ప్రమాదాలు జరిగే అవకాశముందని స్థానికులు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యుత్ అధికారులు వెంటనే వీటిని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

గేట్లు తెరవండి సారూ..



బెల్ టౌన్‌షిప్‌లోకి వచ్చే గేట్‌ను మూసివేసిన యాజమాన్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కొన్ని నెలల క్రితం భద్రతా చర్యల్లో భాగంగా బెల్ యాజమాన్యం ఇతర కాలనీల నుంచి బెల్ టౌన్‌షిప్‌లోకి వచ్చే కొన్ని గేట్లను మూసివేశారు. ఆ సమయంలో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా ప్రస్తుతం వేసవి సెలవులు ముగిసి పాఠశాల ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బెల్ టౌన్‌షిప్‌లోని పలు పాఠశాలల్లో చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారు టౌన్‌షిప్‌లోకి రావాలంటే చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలల సమయానికి అనుగుణంగా మూసివేసిన గేట్‌లను తెరిచే విధంగా యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎట్టకేలకు డ్రైనేజీ నిర్మాణం

- ఏళ్ల తరబడి కాలనీ వాసుల ఇబ్బందులు
- రూ.99 లక్షలతో పనులు ప్రారంభం



జోగిపేట హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న డ్రైనేజీ

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డులో ఎట్టకేలకు డ్రైనేజీ నిర్మాణం పనులను చేపడుతున్నారు. ఈ పనులకు గాను ప్రభుత్వం రూ.99 లక్షలు నిధులను కేటాయించింది. హౌసింగ్ బోర్డు ఏర్పడి ఏళ్లు అవుతున్నా డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో రోడ్డుపై నీరు నిలిచి కాలనీ వాసులతో పాటు వాహనదారులు సైతం ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. జోగిపేట-సంగారెడ్డి ప్రధాన రహదారి ప్రక్కనే హౌసింగ్ బోర్డు కాలనీ ఉండటం, ఆయా గృహాల నుంచి మురికి నీరంతా సాయిబాబా, అయ్యప్ప దేవాలయాల మీదుగా వెళ్లడంతో భక్తులు కూడా ఇబ్బందులు పడ్డారు. వర్షాకాలంలో ఇళ్ల ముందు మూడు నాలుగు అడుగులలోతు వరకు వర్షం నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. కాలనీ పైభాగం నుంచి మురికి కాలువను గతంలో నిర్మించి కిందన అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. రాష్ట్రంలో అధికారం మారిన తర్వాత పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దేందుకు అవసరమైన నిధులను కేటాయించడంతో ప్రధాన రహదారి ప్రక్కన 450 మీటర్ల పొడగునా పెద్ద డ్రైనేజీని అయ్యప్ప దేవాలయం వరకు నిర్మించి ప్రక్కనే ఉన్న కల్వర్టుకు కలిపి ఆ నీటిని కింది భాగాన ఉన్న కాలువలోకి తరలించేలా నిర్మాణం చేపడుతున్నారు.

ఇంట్లోకి వెళ్లేదెట్లా?

హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన రోడ్డు ప్రక్కన ఉన్న సుమారు పదికి పైగా ఇళ్ల గేట్లను, గోడలను, మెట్లను నిర్మాణ పనుల్లో భాగంగా తొలగించారు. మురికి కాలువను నిర్మించిన తర్వాత కూడా ఇంట్లోకి వెళ్లేందుకు వారు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రస్తుతం టెంపరరీగా ఇనుప మెట్లను వేసుకున్నారు. మురికి కాలువలను నిర్మించిన తర్వాత సొంత ఖర్చులతో మెట్లు నిర్మించుకోవాల్సిన పరిస్థితి ఉంది. కాలువల నిర్మాణం పూర్తయిన తర్వాత ఇంకా రెండు ఫీట్ల ఎత్తులో మెట్లు నిర్మించుకోవాలి.



తాత్కాలికంగా మెట్లు వేసుకున్న కాలనీ వాసులు

> **కాలనీ వాసులకు ఇబ్బంది కలగనివ్వం**
>
> మురికి కాలువల నిర్మాణం పూర్తయిన తర్వాత దానిపై స్లాబ్ వేస్తాం. తర్వాత ఎవరికి వారు తమ ఇళ్ల వద్ద రెండడుగు ఎత్తులో మెట్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. దర్గాకు వెళ్లే సీసీ రోడ్డు కూడా చాలా ఎత్తు ఉండటంతో దాన్ని కూడా ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం. సీసీ రోడ్డుపై ప్రజలు, కాలనీ చెందిన వారు వెళ్లేందుకు వీలుగా రోడ్డును ఏర్పాటు చేస్తాం. రూ.99 లక్షలతో మురికి కాలువ నిర్మిస్తున్నాం. నాణ్యతతో కూడిన పనులు చేపడుతాం.
>
> ఏఈ శ్రీకాంత్, జోగిపేట మున్సిపాలిటీ

సంక్షిప్త వార్తలు

◆ మండల విద్యాధికారిగా బస్వరాజ్

జహీరాబాద్ టౌన్: మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా బస్వరాజ్ బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓగా ఉన్న కె.బస్వరాజ్ ఈ మే 30న పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో మండలంలోని సత్వార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఉన్న బస్వరాజ్‌ను ఎంఈఓగా నియమిస్తూ జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బాధ్యతను స్వీకరించారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ రమేష్‌బాబు బుధవారం పరిశీలించారు. ఇందిరానగర్, మార్డి, రాపర్తి, తదితర చోట్ల పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు.

◆ భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం

కల్హేర్(నారాయణఖేడ్): భూ భారతి సదస్సులతో భూ సమస్యలు పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ శివ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని మాసాన్‌పల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ మల్లేశం, సిబ్బంది చెతక్, రవి, రాజు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కమిషన్ ఎదుట హాజరుకావాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కార్యకర్తలు హైదరాబాద్ బీఆర్‌కే భవన్‌కు తరలివెళ్లారు. ఈసందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తమ నేతలపై అక్రమ కేసులు పెడుతుందని వాపోయారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు పరమేష్, నర్సింహులు, జంగయ్య పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

◆ 127వ రోజుకు చేరిన నిరసనలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు బుధవారం 127వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లిలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో స్థానిక మహిళలు పాల్గొని సంఘీభావం తెలిపారు. డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు నిలిపి వేసే వరకు నిరసనలు విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు, రైతులు, తదతరులు పాల్గొన్నారు.

◆ క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలి

నారాయణఖేడ్: క్యూబా దేశంపై అమెరికా విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఖేడ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. అమెరికా ప్రపంచ ప్రజలకు శత్రువని అన్నారు. ఐఎంఎఫ్ ప్రపంచ బ్యాంకు, డబ్ల్యూటీవోను ఉపయోగించుకుని అమెరికా ప్రపంచ దేశాలపైన పెత్తనం చేస్తుందన్నారు. యుద్ధాలను ప్రోత్సహిస్తూ ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తుందని ఆరోపించారు. అమెరికాలో భారతీయ విద్యార్థుల పట్ల అక్కడి వారు కిరాతకంగా వ్యవహరిస్తున్నారన్నారు. అయినప్పటికీ మోదీ, అమెరికా వైఖరిని తప్పు బట్టడం లేదన్నారు. క్యూబాపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు రమేశ్, అరుణ్, అభినవ్, చరణ్, కాన్షిరాం, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఘనంగా రామ్ రావ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో గిరిజనులు

సంగారెడ్డి: చౌటాకూర్ మండలం బొమ్మరెడ్డిగూడెంలో భవానీమాత, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో గిరిజనుల ఆరాధ్య దైవం రామ్ రావ్ మహారాజ్ విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠాపించారు. ఈ సందర్భంగా పౌరాదేవి పీఠాధిపతి బాబు సింగ్ మహారాజ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ధారావత్ రవీంద్రనాయక్, ఆందోల్ ఆర్డీవో పాండు, కవి గాయకులు ఎస్పీ నాయక్ పాల్గొన్నారు.